RNI NO. APTELL/ 2006/18110

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

నిజామాబాద్ సంపుటి : 20 సంచిక : 269 శుక్రవారం 14 ఆగష్టు 2026 పబ్లిషర్ : కొక్కు రవికుమార్ పేజీలు :4 రూ॥1/- krk7018@gmail.com


### ఖైరతాబాద్ గణేషుడికి పోటీగా నాగోల్ బడా గణేష్

హైదరాబాద్ నగరంలో వినాయక చవితి వేడుకలు అంటే అందరికీ ముందుగా ఖైరతాబాద్ గణేషుడే గుర్తుకు వస్తాడు కానీ ఈ ఏడాది నాగోల్ ఎక్స్‌రోడ్ లో అంతకంటే ప్రత్యేకమైన మరియు పెద్దదైన విగ్రహం తయారవుతోంది. త్రిరంగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ఈ భారీ మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వాడకుండా పూర్తిగా ప్రకృతి సిద్ధమైన మట్టితో దీన్ని తీర్చిదిద్దుతున్నారు. గత పదేళ్లుగా ఈ అసోసియేషన్ సభ్యులు ఎకో ఫ్రెండ్లీ వినాయకులను మాత్రమే పూజిస్తూ ప్రజలకు మంచి సందేశం ఇస్తున్నారు.

### హైదరాబాద్ మెట్రో పాసులు బంద్

హైదరాబాద్ మెట్రో రైలులో ప్రయాణికుల సౌకర్యం కోసం రోజువారీ నెలవారీ పాస్‌లను ప్రవేశపెట్టే అంశంపై ఎల్ అండ్ టీ సంస్థ తీవ్ర విముఖత వ్యక్తం చేసింది. మెట్రో రైలు సేవలు ప్రారంభమైన నాటి నుంచి సాధారణ ప్రయాణికులు ఈ పాస్‌ల కోసం నిరంతరం డిమాండ్ చేస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో మెట్రో అధికారులు పలుమార్లు ఆ సంస్థ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినా ఎలాంటి సానుకూల స్పందన రాలేదు. ప్రస్తుత నెట్‌వర్క్ వ్యవస్థలో పాస్‌లు అందించడం అసాధ్యమని సంబంధిత యాజమాన్యం స్పష్టంగా తేల్చి చెప్పింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రత్యేకంగా ఆదేశించినప్పటికీ ప్రయాణికులకు ఊరట లభించలేదు.

## బీజేపీ, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ ఫైట్

### బెంగాల్ ఫార్ములా... గుజరాత్ హమ్లా! ఇక్కడున్నది మమత కాదు.. రేవంత్..! జాగో తెలంగాణా !



బెంగాల్ ఫార్మూలా ఇక్కడ అమల్లోకి వచ్చేసిందని ఒప్పుకున్నారు సీఎం రేవంత్‌రెడ్డి. భారీగా ఓట్ల గల్లంతు జరిగిన తరువాత ఆయన తొలిసారిగా దీనిపై స్పందించారు. మైనార్టీ ఎక్స్‌లెన్స్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడారు.

బెంగాల్ ఫార్మూలా ఇక్కడ అమలు చేయబోతున్నారనే క్లారిటీ ఇచ్చారు ఈ వేదికగా. గుజరాత్ తరహాలో దాడి కూడా షురూ కానుందని హింట్ ఇచ్చారు సీఎం. అయినా వెనక్కి తగ్గేది లేదని, తానంటే ఏమిటో చూపిస్తాననే విధంగా ఆయన మాట్లాడిన తీరు. బీజేపీ, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ ఫైట్ ఉంటుందనే సంకేతాలిచ్చినట్టయ్యింది. అన్ని విధాలుగా బయ పెట్టించి మమతను ఓడగొట్టారన్న రేవంత్.. తాను మమతను కాదని, రేవంత్ అంటే ఏమిటో మీకు తెలియచేస్తానని ఆయన డైరెక్ట్ ఎటాక్ చెయ్యడం.. 2లో ...ంగాణలో ఇరు పార్టీల యుద్ధ వాతావరణం గురించి చెప్పకనే చెప్పారు.

# భారత్‌తో సరిహద్దు వివాదం

## ఒప్పంద పత్రాలు పోగొట్టుకున్న నేపాల్..

### భారత్-నేపాల్ సరిహద్దు వివాదంలో ట్విస్ట్.. సరిహద్దు విభజనకు కీలకంగా ఉన్న "సుగౌలీ ఒప్పందం".. అసలు పత్రాలు ఉన్నాయో లేదో తెలియదన్న నేపాల్ ప్రభుత్వం..




భారత్-నేపాల్ మధ్య కొనసాగుతున్న సరిహద్దు వివాదంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. 210 ఏళ్ల నాటి "సుగౌలి ఒప్పంద పత్రాలు" తమ వద్ద ఉన్నాయో లేవో ఖచ్చితంగా నిర్ధారించ లేకపోతున్నామని ఆ దేశ ప్రభుత్వం ప్రకటించింది. 1816 సుగౌలి ఒప్పందం ఈ మొత్తం సరిహద్దు వివాదానికి కీలకంగా ఉంది. ఈ ఒప్పందం బ్రిటిష్ ఇండియా, నేపాల్ మధ్య సరిహద్దు నిర్ణయించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. నేపాల్ పార్లమెంటరీ విచారణ కమిటీ ఆర్కైవ్స్, ప్రభుత్వ శాఖలు, మ్యూజియాల్లో అన్వేషించినప్పటికీ ఈ ఒప్పంద అసలు పత్రాలు గుర్తించలేక పోయింది. ఈ విషయాన్ని నేపాల్ విదేశాంగ మత్రి శిశిర్ ఖనాల్ పార్లమెంట్‌లో చెప్పారు. భుత్వం వద్ద అధికారిక సుగౌలీ ఒప్పందం అసలు పత్రం ఉందో లేదో ఖచ్చితంగా చెప్పలేమని తెలిపారు.

నేషనల్ ఆర్కైవ్స్‌లో కొన్ని ఒప్పందాలకు సంబంధించిన పత్రాలు ఉన్నాయని, కానీ అవే అసలు అధికారిక పత్రాలో కాదో నిర్ధారణ కాలేదని చెప్పారు. 1816 సుగౌలీ ఒప్పందం, 1950 భారత్-నేపాల్ శాంతి, స్నేహ ఒప్పందానికి సంబంధించిన అసలు పత్రాలు ఎక్కడ ఉన్నాయనేది నేపాల్‌లో సంచలనంగా మారింది. 2019లో అప్పటి నేపాల్ విదేశాంగ మంత్రి ప్రదీప్ గ్యావాలి కూడా ఇదే విషయాన్ని ప్రస్తావించారు. తమ వద్ద రెండు ఒప్పందాల కాపీలు ఉన్నాయని చెప్పారు.

1814-16 మధ్య జరిగిన ఆంగ్లో-నేపాల్ యుద్ధం తర్వాత సుగౌలీ ఒప్పందం కుదిరింది. 1815 డిసెంబర్‌లో దీనిపై సంతకాలు జరగగా, 1816 మార్చిలో ఇది అధికారికంగా ఆమోదించారు. ఈ ఒప్పందం ఆధునిక నేపాల్ భౌగోళిక సరిహద్దులకు పునాది వేసిన కీలక పత్రంగా పరిగణించబడుతోంది. భారత్-నేపాల్ సరిహద్దు వివాదంలో ఆర్టికల్ 5 అత్యంత ముఖ్యమైంది. దీని ప్రకారం కాళీ నది నేపాల్ పశ్చిమ సరిహద్దుగా పరిగణించబడుతోంది. అయితే, ఈ నది ఎక్కడ పుడుతుందనే దానిపై రెండు దేశాల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. 2లో

## రెబల్ ఎంపీలపై పోరాటం.. సుప్రీంకోర్టులో పిటిషన్ వేయనున్న టీఎంసీ



తిరుగుబాటు లోక్‌సభ ఎంపీలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తృణమూల్ కాంగ్రెస్ సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ ఫిరాయింపు నిరోధక నిబంధనల కింద ఆయా ఎంపీలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేయనున్నట్లు సమాచారం. పార్టీ వర్గాల ప్రకారం.. రానున్న 7 నుంచి 10 రోజుల్లో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసే అవకాశం ఉంది. తిరుగుబాటు ఎంపీలు పార్లమెంట్ సభ్యులుగా కొనసాగడాన్ని సవాల్ చేస్తూ టీఎంసీ ఈ న్యాయపోరాటాన్ని ముందుకు తీసుకెళ్లనున్నట్లు తెలుస్తోంది.

పార్టీ ఫిరాయింపుల నిరోధక నిబంధనల

### పేదోడికి చారణా.. పెద్దోడికి బారాణా!

## సంక్షేమ పథకాల తీరిదేనా?

### అనర్హులకూ దక్కుతున్న ఉచిత పథకాలు..!



ఉచిత పథకాలపై కోర్టు మొట్టికాయలు వేసినా .. పరిస్థితులు మారేలా లేవు. పథకాలు పక్కదారి పట్టినా.. ఓట్ల వేటలో వీటిని చూసీ చూడనట్టుగా పోవడమే పాలకులు చేస్తూ వస్తున్న తంతు. పథకాలు మంచివే. ఉద్దేశ్యమూ మంచిదే. కానీ అది అర్హులకు దక్కినప్పుడు మాత్రమే. అనర్హులకూ దక్కితే.? అక్కడే ప్రజాధనం వృథా అయ్యేది. ఇప్పుడు కోర్టులు తప్పుబడుతున్నదీ దీన్నే. తెలంగాణలో మొత్తం కుటుంబాలు 1.17 కోట్లుగా ఉంటే.. రేషన్‌కార్డులు కూడా 1.05 కోట్లున్నాయి. అంటే ఎన్ని కుటుంబాలుంటే అన్ని రేషన్‌కార్డులు. మరి తెలంగాణలో పేదోడే లేడా? రేషన్ కార్డు ప్రమాణికంగానే పథకాలు అమలు చేస్తూ వస్తున్న ప్రభుత్వాలు.. అవి ప్రవేశపెట్టే ప్రతీ పథకాన్ని ఇలా రాష్ట్రంలోని అన్ని కుటుంబాలకు అందిస్తున్నారన్న మాట. ఈ లెక్కన పేదోడికి చారణా.. పెద్దోడికి బారాణా మేర అందుతున్నాయి పథకాలు. 2లో

## కూకట్ పల్లిలో 'ఇందిరమ్మ ఇండ్ల టవర్స్'కు శంకుస్థాపన..

### తెలంగాణ అభివృద్ధి బాధ్యత మాదే: సీఎం రేవంత్ రెడ్డి

ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ శంకుస్థాపన
పేదల ఇళ్ల కల నెరవేరుస్తాం
కరువు కోసం క్షుద్ర పూజలు

2లో



### స్వేచ్ఛ ఓకే.. విద్వేషం నాట్ ఓకే..

## మంత్రి పొన్నం స్ట్రాంగ్ వార్నింగ్



ఒకరి భావప్రకటన స్వేచ్ఛ.. మరొకరి గౌరవానికి భంగం కలిగించేలా ఉండకూడదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ హేట్ స్పీచ్ సెలెక్ట్ కమిటీ చైర్మన్ గా వ్యవహరిస్తున్న ఆయన.. గురువారం అసెంబ్లీ కమిటీ హాల్ లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. కులం, మతం, ప్రాంతం, భాష ఆధారంగా ద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రసంగాలు సమాజంలో ఉద్రిక్తతలకు దారితీస్తాయని అన్నారు. ఇలాంటి ప్రసంగాల వల్ల శాంతిభద్రతలకు మాత్రమే కాకుండా సామాజిక ఐక్యతకు కూడా నష్టం కలిగే అవకాశం ఉందన్నారు. అందుకే హేట్ స్పీచ్‌ను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ కమిటీ సమగ్రంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి పొన్నం అన్నారు. చట్టపరమైన అంశాలు, ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలు, వాటి అమలులో ఎదురవుతున్న సమస్యలపై క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఈ అంశంలో ప్రజల భావప్రకటన హక్కును గౌరవిస్తూనే ద్వేషాన్ని ప్రోత్సహించే చర్యలను నిరోధించే విధంగా సమతుల్యమైన విధానాన్ని రూపొందించాలన్నారు. 2లో

### ఎడపల్లి జడ్పీ హెచ్ఎస్ కు దాత ఏనుగు దయానంద్ రెడ్డి 45 డ్యూయాల్ డెస్క్ బెంచీలు పంపిణి.

ఎడపల్లి,ఆగస్టు 13: (ప్రజా గళం) నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ తెలుగు మీడియం పాఠశాలకు దాత ఏనుగు దయానంద రెడ్డి చేయూత అందించారు. 2 లక్షల రూ పాయల విలువైన 45 డ్యూయల్ డెస్క్ బెంచీలను పాఠశాలకు విరాళంగా అందించారు. గురువారం స్థానిక సర్పంచ్ కందగట్ల రాంచందర్, హెచ్ఎం వేములపల్లి రవికుమార్ సమక్షంలో బెంచీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా దాత ఏనుగు దయానంద్ రెడ్డికి పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యు డు గంగారెడ్డి, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మల్లెపూ ల శ్రీనివాస్, వార్డు సభ్యుడు ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.




## అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్.. స్టీల్ బ్రిడ్జ్ వద్ద ఆ 'వంపు' ఎందుకు?

ఏపీ రాజధాని అమరావతిలో సీడ్ యాక్సెస్ రోడ్డు ఈ-3ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈ క్రమంలో సీడ్ యాక్సెస్ రోడ్డును అనుసంధానించే స్టీల్ బ్రిడ్జిని రాష్ట్ర ప్రజలకు అంకింత చేస్తూ ఉండవల్లి వద్ద శిలాఫలకం ఆవిష్కరించారు. ఇదిలా ఉంటే స్టీల్ బ్రిడ్జి వద్ద ఉన్న ఒక ప్రత్యేకమైన వంపు ప్రస్తుతం సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రోడ్డును నేరుగా నిర్మించకుండా.. ఈ ఒంపు ఎందుకంటూ పలువురు విమర్శిస్తున్నారు. అయితే రోడ్డును 'S' ఆకారంలో నిర్మించడం వెనుక శాస్త్రీయ కారణాలు ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు. ఆ రోడ్డు వంపు ఉన్న వెనుక ఉన్న కథేంటో ఈ ప్రత్యేక కథనంలో చూద్దాం.

భవిష్యత్ ఎలివేటెడ్ కారిడార్

సీడ్ యాక్సెస్ రోడ్డు ఈ-3ని ప్రస్తుత అవసరాలతో పాటు భవిష్యత్ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని డిజైన్ చేశారు. భవిష్యత్తులో రాజధాని ప్రాంతంలో పెరిగే రద్దీని ముందే ఓ అంచనా వేసి.. దీన్ని రూపొందించారు. దొండపాడు నుండి తాడేపల్లి వరకు చేపట్టబోయే భారీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి అనుగుణంగా ఈ ప్రాజెక్ట్ అలైన్‌మెంట్‌ను ఫైనల్ చేశారు. 2లో

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....
ప్రజాగళం
తెలుగు దినపత్రిక



## సంపాదకీయం

# కాస్ట్రో స్ఫూర్తి అజరామరం

క్యూబా విప్లవ నేత, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట యోధుడు ఫైడల్ కాస్ట్రో శతజయంతిని ఆగస్టు 13న ప్రపంచంలోని పురోగామి శక్తులన్నీ ఎంతో స్ఫూర్తివంతంగా నిర్వహిస్తున్నాయి. 1926 ఆగస్టు 13న క్యూబాలోని చిన్న పట్టణంలో జన్మించిన కాస్ట్రో 2016 నవంబర్ 25న రాజధాని హవానాలో మరణించారు. 90 ఏళ్ల నిండు జీవితంలో కాస్ట్రో క్యూబా ప్రజలకే కాకుండా విశ్వ మానవాళికి చేసిన సేవలు, అందించిన స్ఫూర్తి అద్వితీయమైనవి. సహచరుడు చే గువేరా, సోదరుడు రావుల్ కాస్ట్రో తదితరులతో కలిసి ఆయన 1959లో క్యూబాలో విప్లవాన్ని సాధించడం ద్వారా, అమెరికా తన "పెరటి దొడ్డి"గా భావిస్తున్న లాటిన్ అమెరికా ఖండంలో విప్లవాలకు తలుపులు తెరిచాడు. కాస్ట్రో కృషి క్యూబాకు మాత్రమే పరిమితమైనది కాదు. క్యూబా విప్లవ సాధనలోనూ, అక్కడ సోషలిజం నిర్మాణంలోనూ, అంతర్జాతీయంగా వలస విముక్తి పోరాటాలకు ప్రత్యక్ష, పరోక్ష సాయాన్ని అందించడం లోనూ, ప్రపంచంలో ఎక్కడ విపత్తులు జరిగినా అక్కడికి క్యూబా వైద్యులను, సహాయక సిబ్బందిని పంపించి ప్రజలకు సేవలు అందించడంలోనూ, లాటిన్ అమెరికా ఖండంలో సామ్రాజ్యవాద వ్యతిరేక కూటముల ఏర్పాటులోనూ కాస్ట్రో చేసిన ఎనలేని కృషి ఆయనను గొప్ప అంతర్జాతీయ నేతగా, విశ్వమానవాళి సంక్షేమాన్ని కాంక్షించే మానవతా వాదిగా నిలిపాయి. శతజయంతి సందర్భంగా ఫైడల్ కాస్ట్రో విశ్వమానవాళికి చేసిన సేవలను స్మరించుకోవడంతోపాటు ఆయన అందించిన విప్లవ వారసత్వాన్ని, సామ్రాజ్యవాద వ్యతిరేక స్ఫూర్తిని నేటి యువతరానికి బదిలీ చేయడం అవసరం. అందునా ప్రపంచమంతటా, మన దేశంలోనూ మితవాద శక్తుల రాజకీయ కుట్రలపై జెన్ జి తరం తిరుగుబాటు చేస్తున్న ఈ సమయంలో ఇది మరింత అవసరం. క్యూబా విప్లవంలో కాస్ట్రో నిర్వహించిన నాయకత్వం పాత్ర క్యూబాలో విప్లవం సాధించే నాటికి కాస్ట్రో 33 ఏళ్ల యువకుడు. విద్యార్థి దశ నుండే ఆయన ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాన్ని ఎక్కుపెట్టాడు. క్యూబాలోని వనరులన్నిటిపై అమెరికా సామ్రాజ్యవాదులు పెత్తనం సాగిస్తూ ప్రజలను పీల్చిపిప్పి చేస్తుండడం, దీనికి నిరంకుశ క్యూబా పాలకులు వత్తాసు పలకడం నాటి యువతరం సహించలేకపోయింది. ఈ దోపిడీ విధానాలపై పోరాట బావుటా ఎగురవేసింది. కాస్ట్రో అనేక పోరాటాల్లో పాల్గొన్నాడు, నాయకత్వం వహించాడు. అమెరికా సాయంతో ఆ పోరాటాలను నిరంకుశంగా అణచివేస్తున్న పాలకులపై సాయుధ తిరగుబాటే మార్గమని భావించిన యువకులు ఆయుధాల కోసం సైనిక స్థావరాలపై దాడులు చేశారు. 1953 జులై 26 కాస్ట్రో నాయకత్వంలో మోంకాడా సైనిక బరాక్‌పై దాడి చేశారు. అది విఫలమైంది. నాటి క్యూబా నియంత బాటిస్టా సైన్యం 80 మంది యువకులను ఊచకోత కోసి చంపింది. కాస్ట్రోను అరెస్టు చేసి విచారణ చేపట్టినప్పుడు ఆయన తన తరఫున కోర్టులో తనే వాదించుకుంటూ తన పోరాటాన్ని సమర్థించుకున్నాడు. సాహసంగా అనిపించినా ఇది సరైందని కాలమే నిర్ణయిస్తుంది, "చరిత్ర నన్ను నిర్దోషిగా ప్రకటిస్తుంది," అని కాస్ట్రో న్యాయమూర్తి ముందు ధైర్యంగా ప్రకటించాడు. మాంకాడా తిరుగుబాటు అంతం కాలేదు. అది జులై 26 ఉద్యమంగా చిగురించి అనేక ప్రాంతాలకు విస్తరించింది. అమెరికన్ సామ్రాజ్యవాద దోపిడీ, బాటిస్టా ప్రభుత్వ నిరంకుశ అణచివేతల మధ్య ప్రజలు నలిగిపోతున్న క్యూబాలో పరిస్థితులు విప్లవానికి అనుకూలంగా ఉన్నాయని గ్రహించిన కాస్ట్రో 82 మంది 'జులై 26 ఉద్యమకారులను' తీసుకుని మెక్సికో నుండి "గ్రాన్మా" పడవలో బయలుదేరాడు. వారి బృందంలో చే గువేరా, రావుల్ కాస్ట్రోలు కూడా ఉన్నారు. వారు క్యూబా తీరాన్ని చేరుకోవడంతోనే పసికట్టిన బాటిస్టా దళాలు పెద్ద ఎత్తున తిరుగుబాటుదారులపై దాడి చేశాయి. 82 మందిలో 17 మంది మినహా మిగిలిన అందరూ చనిపోయారు. మిగిలిన యోధులు గెరిల్లా యుద్ధ తంత్రాన్ని అనుసరించారు. రైతాంగం, పట్టణ మధ్యతరగతి మద్దతు కూడగట్టారు. నాలుగు దళాలుగా విడిపోయి నాలుగు వైపుల నుండి హవానాకు దండయాత్ర సాగించారు. 1959 జనవరి 1న హవానా విప్లవకారుల వశమైంది. క్యూబా విప్లవం విజయం సాధించింది. ఆ విధంగా క్యూబాలోనే కాదు లాటిన్ అమెరికా ఖండంలో ఒక కొత్త శకం ప్రారంభమైంది. కాస్ట్రో దేశ పాలనా పగ్గాలు చేపట్టి, కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో సోషలిజం నిర్మాణానికి నడుం కట్టాడు. ప్రపంచ పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద అగ్రరాజ్యం, అమెరికాకు కేవలం 90 మైళ్ల (సుమారు 140 కిలో మీటర్ల) దూరంలో ఉన్న అతి చిన్న ద్వీప దేశం క్యూబా. జనాభా కేవలం కోటి మంది (విప్లవం నాటికి 70 లక్షల మంది). అందువల్ల ఆది నుండీ క్యూబా విప్లవాన్ని నలిపేయడానికి అమెరికా చేయని ప్రయత్నం లేదు. చేయని ఘోరం లేదు. క్యూబాలోని గ్వాంటనామో బేను అమెరికా ఆక్రమించి సైనిక స్థావరం నెలకొల్పుకుని నిరంతరం సైనిక నిఘా పెట్టింది. ప్రజల్లో అసంతృప్తి రెచ్చగొట్టి పెద్ద ఎత్తున వలసలను ప్రోత్సహించింది. క్యూబాపై ఆర్థిక, సైనిక, ఇంధన ఆంక్షలు పెట్టింది. అన్నిటికీ మించిన ఘోరం, ఫైడల్ కాస్ట్రోను చంపడానికి ఆయన జీవిత కాలంలో 600కు పైగా హత్యాయత్నాలు చేసింది. వీటన్నిటినీ తట్టుకుని దేశాన్ని సోషలిస్టు మార్గంలో నడిపించాడు కాస్ట్రో. 140 కోట్ల జనాభా, అయిదో ఆర్థిక వ్యవస్థగల భారత దేశంలో 56 అంగుళాల ఛాతీ ఉన్నదని చెప్పుకునే నేతలు అమెరికా బెదిరింపులకు భయపడి దాని ముందు అడుగడుగునా మోకరిల్లుతున్న తీరుతో పోల్చినప్పుడు ప్రాణాలకు సైతం లెక్కచేయకుండా సామ్రాజ్యవాద పెత్తనానికి వ్యతిరేకంగా క్యూబా ప్రజలను నిలిపిన కాస్ట్రో తెగువ మనకు అర్థమవుతుంది. ఆర్థిక, సైనిక, వాణిజ్య, ఒప్పందాలు, అధిక సుంకాల ద్వారా మన దేశంపై పెత్తనం సాగించడానికి అమెరికా నేడు బరితెగించి చేస్తున్న ప్రయత్నాల నేపథ్యంలో కాస్ట్రో నాయకత్వంలో క్యూబా ప్రజలు సాగించిన సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం మన యువతకు ఎంతగానో స్ఫూర్తినిస్తుందనడంలో సందేహం లేదు. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైన తరువాత 'సోషలిజమో, మరణమో' అని కాస్ట్రో ఇచ్చిన పిలుపు విపరీతమైన కష్టాల్లో కూడా క్యూబాను సోషలిజం మార్గంలో నిలిపింది. నేటికీ క్యూబాపై అమెరికా దిగ్బంధనం, ఆంక్షలు, దాడులు, బెదిరింపులు, వేధింపులు కొనసాగుతూనే ఉన్నాయి. అంతర్జాతీయ విముక్తి పోరాటాలకు కాస్ట్రో నాయకత్వంలో క్యూబా అందించిన అండ ఆఫ్రికా అంతటా వలసవాద వ్యతిరేక, వర్ణవివక్ష వ్యతిరేక ఉద్యమాలకు మద్దతు ఇవ్వడంలో క్యూబా ఒక ప్రధానమైన, పలుసార్లు నిర్ణయాత్మక పాత్ర పోషించింది. 1960ల నుండి 1980ల వరకు సామ్రాజ్యవాద దేశాల నుండి స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న దేశాలకు సహాయం చేయడానికి క్యూబా వేలాది మంది సైనికులు, వైద్యులు, ఉపాధ్యాయులు, సైనిక సలహాదారులను మోహరించింది. 1975లో అంగోలా కొత్తగా పొందిన స్వాతంత్ర్యాన్ని రక్షించడానికి క్యూబా 16 సంవత్సరాల కాలంలో లక్షలాది మంది పోరాట దళాలను పంపింది. అంగోలాపై దాడి చేసిన దక్షిణాఫ్రికా వర్ణవివక్ష దళాలను రెండుసార్లు (1976, 1988లో) క్యూబా దళాలు తిప్పికొట్టాయి. ఇది 1990లో నమీబియా స్వాతంత్ర్యానికి మార్గం సుగమం చేసింది. గినియా-బిసావు, కేప్ వెర్డేలలో పోర్చుగీస్ పాలనకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఉద్యమాలకు, అలాగే అల్జీరియా, కాంగో లోని వలస వ్యతిరేక పోరాటాలకు క్యూబా నేరుగా సాయం అందించింది. అలీనోద్యమాన్ని సామ్రాజ్యవాద వ్యతిరేక శిబిరంలో నిలబెట్టడానికి కాస్ట్రో తీసుకున్న చొరవ అనితరమైనది. కొత్తగా విముక్త పొందిన దేశాలలో ప్రజారోగ్యం, విద్యా వ్యవస్థలను నిర్మించడానికి క్యూబా వైద్యులు, నర్సులు, ఇంజనీర్లతో సహా పెద్ద సంఖ్యలో పౌర స్వచ్ఛంద సేవకులను పంపింది. వేలాది మంది ఆఫ్రికన్ విద్యార్థులకు క్యూబాలో ఉచితంగా వైద్య, సాంకేతిక విద్యనభ్యసించడానికి వసతులు ఏర్పాటు చేశారు. ప్రపంచంలో ఎక్కడ ప్రకృతి విలయం సంభవించినా అక్కడకు వేలాది మంది క్యూబా వైద్య సిబ్బంది వెళ్లి క్షతగాత్రులకు సాయం అందించారు. లాటిన్ అమెరికాలో సామ్రాజ్యవాద వ్యతిరేక కూటముల ఏర్పాటుకు కాస్ట్రో కృషి 21వ శతాబ్దం ఆరంభంలో లాటిన్ అమెరికాలో ఎన్నికల ద్వారా ఏర్పడిన సామ్రాజ్యవాద వ్యతిరేక, వామపక్ష ప్రభుత్వాలను ఒక చోట చేర్చి సామ్రాజ్యవాదాన్ని ఎదిరించేందుకు 33 దేశాలతో 'అలబా' వంటి కూటముల ఏర్పాటులో కాస్ట్రో గొప్ప కృషి చేశారు.

# బీజేపీ, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ ఫైట్

ఎన్నికల సంఘం ద్వారా సర్ దాడి అయి పోయినట్టేనని కూడా పరోక్షంగా వెల్లడించిన ఆయన.. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో పెద్ద ఎత్తున ఓట్లు గల్లంతయ్యాయ న్నారు. మొత్తంగా 70 లక్షల ఓట్లు పోయినట్టేనని కూడా ఒప్పుకున్నారు. సీబీఐ, ఈడీ పేర్లను కూడా ప్రస్తావించిన రేవంత్.. ఇక వీటినీ ఉపయోగిస్తారనే విధంగా మాట్లాడటం చర్చనీయాంశమైంది. మోడీ, అమిత్ షాల చేతుల్లో ఉన్నవి ఇవే అస్త్రాలని రేవంత్ స్పష్టం చేశారు. ఎన్ని కుయుక్తులు పన్నినా .. బీజేపీకి ఇక్కడ చాన్స్ ఇవ్వబోమన్నారు.

బీజేపీపై అప్రమత్తంగా ఉండాలని ముస్లిం మైనార్టీలను కోరారు. ఓట్ చోరీపై అప్రమత్తంగా ఉండాలని, అందరికీ ఈ విషయాన్ని వెల్లడించి.. బీజేపీ ఎలా హమ్లా చేయనుందో వివరించాలన్నారు. బీజేపీ తెలంగాణలో అధికారంలోకి వచ్చినట్టే కలలు కుంటున్నదని,ఇంచు మించు బెంగాల్ తరహాలో తెలంగాణలోనూ పెద్ద ఎత్తున ఓట్లు పోయాయన్నారు. తమకు అలవాటైన దోరణిలో గుజరాత్ తరహా రాజకీయ కుయుక్తులకు దిగుతారని, ఈసీఐ, సీబీఐ, ఈడీ .. లను ఉసిగొల్పుతారని తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ చేసిన కామెంట్స్ ఇప్పుడు పొలిటికల్ సర్కిల్స్‌లో చర్చనీయాంశమయ్యాయి. బీఆరెస్ దీనిపై ఇంతలా ఇప్పటి వరకు స్పందించలేదు. సర్కార్ మాత్రం సర్ తో ఓట్ల చోరీ జరుగుతోందని బాహాటంగా విమర్శలు గుప్పిస్తూ .. బీజేపీని జనం ముందు ఎండగట్టే ప్రయత్నం చేస్తున్నది. దీంతో ఇప్పుడు వార్ కాంగ్రెస్, బీజేపీ మధ్యేనా? అనేలా రాజకీయ వాతావరణం నెలకొన్నది.

# స్వేచ్ఛ ఓకే.. విద్వేషం నాట్ ఓకే.. మంత్రి పొన్నం స్ట్రాంగ్ వార్నింగ్

హేట్ స్పీచ్‌పై ఫిర్యాదులు వచ్చినప్పుడు వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి స్పష్టమైన మార్గదర్శకాలు ఉండాలని మంత్రి అభిప్రాయ పడ్డారు. ఈ కమిటీ రాజకీయాలకు అతీతంగా, అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పనిచేయాలన్నారు. ఎవరైనా ఏ పార్టీకి చెందిన వారైనా, ఏ వర్గానికి చెందిన వారైనా చట్టం ముందు సమానమే అన్న సూత్రాన్ని కాపాడాలన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, సమాజంలో శాంతి, సామరస్యం, పరస్పర గౌరవాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ కమిటీ లక్ష్యమన్నారు.

# సంక్షేమ పథకాల తీరిదేనా?

పేదలకు ఈ సంక్షేమ పథకాలు ఆసరాగా నిలుస్తాయి. కానీ అవే పథకాలు.. అనర్హులకూ చేరితే.. ప్రభుత్వంపై ఆర్థిక భారం. అప్పుల ఊబిలో రాష్ట్రం. ప్రస్తుత ముఖ చిత్రమిదే. పాలకులకు తెలుసు.. అనర్హులకూ పథకాలు వెళ్తున్నాయని, కానీ వాటిని సంస్కరించేందుకు భయపడుతున్నారు. కారణం.. ఓటు బ్యాంకు రాజకీయాలు. అందరికీ ఇస్తే.. అందరూ ఓట్లేస్తారు. మెజారిటీగా పథకాలు అందితే అంతే మెజారిటీగా గెలవొచ్చు. ప్రభుత్వం ఏర్పాటు చేయొచ్చు. తరువాత సంగతి తరువాత. ముందు అధికారంలోకి రావాలి. ఆ తరువాత ముక్కుతూ మూలుగుతూ పథకాలు అమలు చేయొచ్చు. అప్పుల కోసం చిప్పలు పట్టుకుని తిరుగుతూ ముప్పుతిప్పలు పడొచ్చు. పనిలో పని పాత సర్కార్ పాపమే ఇదని కూడా దుమ్మెత్తి పోయొచ్చు. ఇదే కదా ఇక్కడ నడుస్తున్నది. రైతు బంధు అందరికీ అమలు చేసి.. భారీ ఆర్థిక భారాన్ని మోపాడు కేసీఆర్. దీన్ని సవరించి.. సంస్కరిస్తానన్న రేవంత్.. పడావు భూములు తొలగించేశాడు తప్ప..దీనికి ఓ స్లాబ్ పెట్టలేదు. మూడు, ఐదు ఎకరాలకు పరిమితం చేయడం ద్వారా నిజమైన పేదలకు మాత్రమే ఈ రైతు భరోసా దక్కుతుండే. కానీ అలా చేయలేదు. ఇద్దరికీ ఈ పథకం ఓట్లు రాల్చే పథకంగా మారింది మరి. ఇక ఒకేసారి రుణమాఫీ అని దాదాపుగా 21వేల కోట్ల భారం మోసింది రేవంత్ సర్కార్. ఇప్పుడు కోర్టు నిలిపివేసిన కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ కూడా చాలా మంది అనర్హులకు దక్కుతున్నది. అసలు రేషన్ కార్డులు అందరికీ ఇచ్చేసిన తరువాత.. ఇక అర్హులెవరు? అనర్హులెవరు? ఎలా తెలిసేది...? గొంగట్లో అన్నం తింటూ వెంట్రుకలు ఏరిసినట్టుగానే ఉంటుంది. ముందు రేషన్‌కార్డులను తొలగించాలి. అది సాధ్యం కాదు పాలకులకు. మరి పథకాలకు అనర్హులకు చేరకుండా బ్రేకులు ఎలా వేస్తుంది. అందరూ తినండి.. మాకే ఓటేయండి.. అనేదే కదా పాలకుల నినాదం. అందుకే ఫ్రీ పథకాలు వస్తూనే ఉంటాయి. మనం తీసుకుంటూనే ఉంటాం. అప్పులు పెరుగుతూనే ఉంటాయి. పాలకులు మారుతూనే ఉంటారు. మనం ఇంకా కొత్తగా ఏ పథకాలు వస్తాయా అని ఎదురుచూస్తూనే ఉంటాం. కోర్టులు మొట్టికాయలు వేస్తూనే ఉంటాయి. ఇది నిరంతర ప్రక్రియగా సాగుతూనే ఉంటుంది.

# రెబల్ ఎంపీలపై పోరాటం.. సుప్రీంకోర్టులో పిటిషన్ వేయనున్న టీఎంసీ

ప్రకారం తమ పార్టీకి చెందిన తిరుగుబాటు ఎంపీలను అనర్హులుగా ప్రకటించాలని టీఎంసీ కోరుతోంది. ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని.. ఎంపీల లోక్‌సభ సభ్యత్వానికి సంబంధించి తగిన ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో కోరే అవకాశం ఉంది. తిరుగుబాటు ఎంపీలపై న్యాయపరమైన చర్యలను టీఎంసీ మరింత ముమ్మరం చేస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే సుప్రీంకోర్టును ఆశ్రయించనున్న ఎంపీల పేర్లు, వారిపై టీఎంసీ ప్రస్తావించనున్న నిర్దిష్ట కారణాలు, పిటిషన్‌లో పేర్కొనే ఇతర అంశాలపై ఇంకా పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

# అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్.. స్టీల్ బ్రిడ్జ్ వద్ద ఆ 'వంపు' ఎందుకు?

అందువల్లనే భవిష్యత్ అనుసంధానానికి వీలుగా ఈ మార్పు చేశారు.

రాజధాని మాస్టర్ ప్లాన్‌లో ఉన్నదే..!

సీడ్ రోడ్డులోని ఈ వంపును అకస్మాత్తుగా తీసుకొచ్చారనే ప్రచారం నెట్టింట జరుగుతోంది. నేరుగా రోడ్డు వేస్తే ఆ మార్గంలోని టీడీపీ నేతల స్థలాలు, ఆస్తులు పోతాయని ఇలా వంపు తిప్పుతూ రోడ్డు నిర్మించారని పలువురు కామెంట్స్ చేస్తున్నారు.

అయితే ఈ ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని అధికారులు చెబుతున్నారు. ఇది హఠాత్తుగా మార్చిన డిజైన్ కాదని స్పష్టం చేస్తున్నారు. నిజానికి 2017లో సింగపూర్ నిపుణుల సహకారంతో రూపొందించిన అమరావతి ఒరిజినల్ మాస్టర్ ప్లాన్ ప్రకారమే ఈ రోడ్డు నిర్మాణం జరుగుతోందని అంటున్నారు. మాస్టర్ ప్లాన్‌లోని అలైన్‌మెంట్ మార్గదర్శకాలను ఇంజనీరింగ్ తూచ తప్పకుండా పాటిస్తున్నట్లు పేర్కొంటున్నారు.

3 దశల్లో రోడ్డు నిర్మాణం..

సీడ్ యాక్సిస్ రహదారిని మట్టుత్తం మూడు దశల్లో ఏపీ ప్రభుత్వం నిర్మిస్తోంది. తొలిదశలో దొండపాడు నుండి వెంకటపాలెం వరకు (14.35 కి.మీ, రెండో దశలో వెంకటపాలెం నుండి ఉండవల్లి వరకూ, మూడో దశలో ఉండవల్లి నుంచి మణిపాల్ హాస్పిటల్, చీఎ-16కి అనుసంధానం చేయనున్నారు. మూడో దశ పనుల్లో భాగంగానే బకింగ్ హామ్ కాలువపై స్టీల్ వంతెనను నిర్మించారు. దీనినే సీఎం చంద్రబాబు గురువారం ప్రారంభించడం గమనార్హం. ఇక్కడ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడకుండా, వాహనాలు సులభంగా మలుపులు తిరిగేందుకు వీలుగా వంపు డిజైన్‌ను నిర్మించారు.

భద్రతాపరమైన కారణాలు..

అయితే రోడ్లపై 'ఎస్' ఆకారపు వంపులను ఏర్పాటు చేయడం వెనుక భద్రతాపరమైన కారణాలు సైతం దాగున్నాయి. ఒకవేళ వాహనాలు ఒకే వేగంతో నేరుగా వెళ్లేటప్పుడు డ్రైవర్లు ఏకాగ్రత కోల్పోయి 'హైవే హిప్నాసిస్'కు గురయ్యే ప్రమాదం ఉంది. అదే 'ఎ' వంపులు ఉంటే డ్రైవర్లు అప్రమత్తమై వేగాన్ని అడ్జస్ట్ చేసుకునే వీలుంటుంది. అలాగే కొండ ప్రాంతాలు, నదులు, వంతెనల వద్ద ఆకస్మిక ఎత్తుపల్లాలను తగ్గించి.. మార్గాన్ని సాఫీగా మార్చేందుకు కూడా 'సూపర్ ఎలివేషన్'తో కూడిన ఈ 'ఎ' వంపు సహాయపడుతుంది.

# భారత్‌తో సరిహద్దు వివాదం

ఇదే వివాదానికి కారణంగా మారింది.

కాళీ నది ఎక్కడ పుడుతోంది.?

భారత్-నేపాల్ మధ్య కాలాపానీ, లిపులేఖ్, లింపియాధురా వివాదం ఉంది. ఈ ప్రాంతాలు తమవే అని నేపాల్ వాదిస్తోంది. భారత్ ఈ మూడు ప్రాంతాలు తమ భూభాగమని పలుమార్లు స్పష్టం చేసింది. నేపాల్ వాదన ప్రకారం, కాళీ నది లింపియాధురా వద్ద పుడుతోంది. దీనిని బట్టి చూస్తే ఈ మూడు ప్రాంతాలు కాళీ నదికి తూర్పున ఉంటాయి. దీని వల్ల ఈ భూభాగాలు తమవే అని నేపాల్ చెబుతోంది.

భారత వాదన ప్రకారం, కాళీ నది లిపులేఖ్ ప్రాంతానికి దిగువన స్ప్రింగ్స్‌లో నుంచి జన్మిస్తోంది. కాలాపానీ ప్రాంతాన్ని చారిత్రకంగా పిథోరాగఢ్ జిల్లాలో భాగంగా పరిగణించే పరిపాలనా, రెవెన్యూ రికార్డులను భారత్ ప్రస్తావిస్తోంది.ఇరు దేశాలు బ్రిటిష్ కాలం నాటి మ్యాపులు, చారిత్రక రికార్డుల్ని ఆధారాలుగా చూపిస్న?న్నాయి. ఇక్కడ మరో ట్విస్ట్ ఏంటంటే కాళీ నది లింపియాధురాలోనే పుడుతుందని సుగౌలీ ఒప్పందంలో ఎక్కడా పేర్కొనలేదు.

2020లో ముదిరిన వివాదం:

2020లో భారత్ ఉత్తరాఖండ్‌ను లిపులేఖ్‌తో అనుసంధానించే 80 కిలోమీటర్ల రోడ్డును ప్రారంభించింది. ఇది కైలాస మానససరోవర్ యాత్ర మార్గంలో ఒక భాగం. అయితే, దీనిపై అప్పటి నేపాల్ లోని కేపీ శర్మ ఓలి ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. ఓలి ప్రభుత్వం లింపియాధురా, లిపులేఖ్, కాలాపానీ ప్రాంతాలను కలుపుతూ కొత్త రాజకీయ మ్యాప్‌ను విడుదల చేసింది. ఈ మ్యాప్‌కు రాజ్యాంగ సవరణ ద్వారా నేపాల్ పార్లమెంట్ ఆమోదం తెలిపింది. అయితే, భారత్ ఈ చర్యల్ని తిరస్కరించింది.

# కూకట్ పల్లిలో 'ఇందిరమ్మ ఇండ్ల టవర్స్'కు శంకుస్థాపన..

## తెలంగాణ అభివృద్ధి బాధ్యత మాదే: సీఎం రేవంత్ రెడ్డి

కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఇందిరమ్మ ఇండ్లు" టవర్స్ శంకుస్థాపన కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. గతంలో ఎంపీగా పోటీ చేసిన సమయంలో కూకట్‌పల్లి ప్రజలు నన్ను ఆశీర్వదించి గల్లీ నుంచి ఢిల్లీకి పంపారని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేసుకున్నారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉండటం, గత ప్రభుత్వం సరిగా నిధులు మంజూరు చేయకపోవడంతో ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఇప్పుడు కూకట్‌పల్లిని అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు తమ వద్ద పూర్తి అధికారం ఉందని, ఈ ప్రాంతానికి ఏ విధమైన అభివృద్ధి కావాలన్నా అడిగి మరీ చేయించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అంతేకాకుండా కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని ప్రత్యేక దృష్టితో అభివృద్ధి చేయాలని మంత్రి శ్రీధర్ బాబు గారిని సీఎం ఆదేశించారు.

గత ప్రభుత్వ పదేళ్ల పాలనకు, తమ రెండేళ్ల పాలనకు తేడాను గమనించి బేరీజు వేసుకోవాలని సీఎం సూచించారు. రాష్ట్రంలోని 3 కోట్ల 28 లక్షల మందికి సన్నబియ్యం, ప్రతి పేద కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని తెలిపారు. మహిళల ఆత్మగౌరవాన్ని పెంచేలా ఇందిరమ్మ చీరలను సారెగా ఇవ్వడమే కాకుండా, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామన్నారు. స్వయం సహాయక సంఘాలకు రూ.65 వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించామని, కొందరు కడుపులో విషం పెట్టుకుని ఆటో డ్రైవర్లను ప్రభుత్వంపైకి ఉసిగొల్పినా వెనక్కి తగ్గకుండా మహిళలకు బస్సులనే యజమానులుగా చేశామని స్పష్టం చేశారు. స్వయం సహాయక సంఘాలు పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించడంతో పాటు వారి ఉత్పత్తుల విక్రయానికి శిల్పారామంలో స్టాళ్లను కేటాయించామన్నారు.

పట్టణ పేదల కోసం ఇందిరమ్మ టవర్స్: ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని నమ్మొద్దు:

గతంలో డబ్బా ఇండ్లు వద్దంటూ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని చెప్పిన వాళ్లు ఒక్కరికైనా ఇల్లు ఇచ్చారా అని సీఎం రేవంత్ ప్రశ్నించారు. నగరాల్లోని పేదల సొంతింటి కలను నెరవేర్చడానికే తమ ప్రభుత్వం మొదటి విడతలో లక్ష ఇళ్లను అందించేలా ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టిందని తెలిపారు. 22ఏ భూముల విషయంలో ప్రజలెవరూ సొంత స్థలాలు కోల్పోకుండా చూసే బాధ్యత తమదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో కొందరు చేసే అబద్ధపు ప్రచారాన్ని నమ్మవద్దని, కొంతమంది దుర్మార్గులు రాష్ట్రంలో కరువు రావాలని క్షుద్ర పూజలు చేసినా.. దేవుడి ఆశీర్వాదం మన వైపే ఉండి సమృద్ధిగా వర్షాలు కురిపించాడని వ్యాఖ్యానించారు. కుటిల బుద్ధితో వినాశనం కోరేవారికి ఆ క్షుద్ర పూజలే తిరిగి అష్ట దిగ్బంధనంగా మారతాయని తీవ్రంగా వ్యాఖ్యానిస్తూ, ప్రజల అండదండలతో తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళ్తానని సీఎం ధీమా వ్యక్తం చేశారు.

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....
ప్రజాగళం
తెలుగు దినపత్రిక
శుక్రవారం
14-08-2026



# హైవే పై రోడ్డు టెర్రర్

## -స్పాట్ లోనే ఇద్దరు మృతి.

## -సంఘటన స్థలాన్ని సందర్శించిన సిపి సాయి చైతన్య

ఆర్మూర్ ఆగస్టు 13(ప్రజాగళం) ఆర్మూర్ మండలం గోవింద్ పెట్ బ్రిడ్జి హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సంఘటన స్థలంలోని ఇరువురు మృతి చెందగా పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి ,తీర్థ యాత్ర కాస్త విషాదంగా మిగిల్చిన ఘటన ఆర్మూర్ ప్రాంతంలో చోటుచేసుకుంది.మహారాష్ట్ర నాందేడ్ కిన్వట్ నుండి హైదరాబాద్ చిన్న జీయర్ స్వామి తీర్థయాత్రకు రెండు బస్సులతో తీర్థయాత్రకు బయలుదేరారు.ఆర్మూర్ మండల పరిధిలోని గోవింద్ పెట్ బ్రిడ్జి వద్ద ముందున్న బస్సు టైర్ పంచర్ కావడంతో రెండు బస్సులు హైవే పై నిలిచిపోయాయి.వెనుక బస్సులో ఉన్న ప్రయాణికులు కొందరు టైరు పంచర్ అయినందున మధ్యలోని డివైడర్ పై కూర్చుని సేద తీరుతున్నారు.వెనుక వైపు నుండి వస్తున్న లారీ ఆగి ఉన్న బస్సును ప్రమాదవశాత్తు అతివేగంతో బస్సును ఢీకొంది.దీంతో ప్రయాణికులతో నిండి ఉన్న బస్సు ముందుకు కదలి డివైడర్ ప్రాంతంలో కూర్చున్న ప్రయాణికుల మీదికి దూసుకెళ్లింది.దీంతో ఇద్దరు మహిళలు కిన్వట్ కు చెందిన సుజాత,మాధవి అక్కడికక్కడే మృతి చెందారు.మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని క్రేన్ సాయంతో బస్సును పక్కకు మరోల్చారు. సంఘటన స్థలాన్ని జిల్లా సిపి సాయి చైతన్య సందర్శించారు. మృతదేహాలను ఆర్మూర్ ఏరియా ఆసుపత్రి కి తరలించి, ఆర్మూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# ఎడపల్లి గ్రామంలోని స్థానిక సమస్యలు పరిష్కరించాలి.

## కలెక్టర్ భవేష్ మిశ్రాకు విన్నవించిన సర్పంచ్ కందగట్ల రాంచందర్.



ఎడపల్లి,ఆగస్టు 13: (ప్రజా గళం) నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలోని కస్తూ ర్బా గాంధీ బాలికల పాఠశాల, తెలంగాణ గురుకుల బాలికల పాఠశాలను బుధవారం తనిఖీ కి విచ్చేసిన జిల్లా ఇంచార్జి కలెక్టర్ భవేశ్ మిశ్రా కి స్థానిక సర్పంచ్ కందగట్ల రాంచందర్ స్థానిక సమస్యలు పరిష్కరిం చాలని విన్నవించారు. అంతకుముందు కలెక్టర్ ని సర్పంచ్ రాంచందర్ శాలువ కప్పి ఘనంగా సన్మానం చేశారు.అనంతరం స్థానిక సమస్యలను అయన దృష్టకి తీసు కెళ్లి పరిస్కరించాలని కోరారు.కెజిబివి పాఠశాలలో వి ద్యార్థులకు సరైన బెడ్స్ లేవని, అలాగే హిందీ టీచర్ కూ డా లేరని తెలిపారు.జిల్లా పరిషత్ పాఠశాలకి పిఈటి లే రని ఆ స్థానాన్ని వెంటనే భర్తీ చేయాల ని కోరారు. స్థానిక రెండవ నెంబర్ అంగన్ వాడి భవనం శిథిలావస్థలో ఉన్నదని,వర్షం పడి భవనంలోకి నీళ్లు చేరుతు న్నాయని,దింతో చిన్నారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని,కావున అంగన్ వాడి కేంద్రంను అక్కడే నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్ కి తాత్కాలికంగా మార్చాలని సర్పంచ్ కందగట్ల రాంచందర్ కలెక్టర్ ని కోరారు. ఈ సందర్బంగా సర్పంచ్ విన్నపానికి కలెక్టర్ భవేష్ మిశ్రా సానుకూలంగా స్పందించడం జరిగింది అని అయన తెలిపారు. సర్పంచ్ వెంట బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యుడు మల్లెపూల శ్రీనివాస్,రాఘు, ద్యాకం సాయిలు,తదితరులు ఉన్నారు.

# నేడు బాసరలో నిర్వహించే హర్ ఘర్ తిరంగా ర్యాలీని విజయవంతం చేయాలి.

## బిజెపి మండల అధ్యక్షుడు పుట్నాల సాయినాథ్ పిలుపు....



బాసర,ఆగస్టు 13: (ప్రజా గళం) బిజెపి రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు శుక్రవారం బాసర మండల కేంద్రంలో చేపట్టే హర్ ఘర్ తిరంగా ర్యాలీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిజెపి బాసర మండల అధ్యక్షుడు పుట్లాల సాయినాథ్ పిలుపునిచ్చా రు.ఉదయం.11:గంటలకు స్వామి వివేకానంద చౌరస్తా నుంచి టెంపుల్ వరకు ర్యాలీ కొనసాగుతుందని,ఈ సందర్బంగా వివిధ మోర్చా నాయకులు,సీనియర్ నాయకులు,కార్యకర్తలు,ఈ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని అయన కోరారు.

# ఎస్సి హాస్టల్ లో ప్రభుత్వం అందించే స్టీల్ ప్లేట్లను పంపి ణి చేసిన సర్పంచ్....

ఎడపల్లి,ఆగస్టు 13: (ప్రజా గళం)ఎడపల్లి మండల కేంద్రంలోని షెడ్యూలు కులాల బాలు ర(ఎస్సి)వసతి గృహంలో విద్యార్థులకు ప్రభుత్వం అందించే స్టీల్ ప్లేట్లను స్థానిక సర్పంచ్ కందగట్ల రాంచందర్ చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు.అనంతరం వార్డెన్ శ్రీకాంత్ యాదవ్ సర్పంచ్ రాంచందర్ ను శాలువ తో ఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగా విద్యార్థులతో కలిసి సర్పంచ్ తో పాటు వార్డు సభ్యులు సహపంక్తి భోజనం చేశారు.ఈ సందర్బంగా విద్యార్థులతో కలిసి భోజనం చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బర్దిపూర్ విట్టల్,షేక్.ముస్తాక్,బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లెపూల శ్రీనివాస్,వార్డెన్ శ్రీకాంత్ యాదవ్ తదిదరులు పాల్గొన్నారు.

# వేతనాలు రాక దినసరి కూలీల గోస.

## -వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలు : మద్దతు ప్రకటించిన ఆర్.పి.ఐ పార్టీ



నిజామాబాద్ సిటీ , ఆగస్టు 13( ప్రజా గళం ) ఆసియా ఖండంలోని ప్రఖ్యాతిగాంచిన నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ లో పనిచేస్తున్న దినసరి కూలీలు మూడు నెలలుగా జీతాలు రాక దీనస్థితిలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు.

ఈ నిరాహార దీక్షలకు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా రిపబ్లికన్ పార్టీ అఫ్ ఇండియా రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు నీరడి లక్ష్మణ్ మాట్లాడుతూ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఒంటెద్దు పోకడలతో దినసరి కూలీలను చిన్నచూపు చూస్తున్నారని ఆరోపించారు. ఆర్పిఐ పార్టీ పక్షాన మా ప్రతినిధులు వెళ్లి బకాయిల విషయమై చైర్మన్ ను నీలదియగా నిర్లక్ష్యంగా వ్యవహరించాడని ఆవేదన వ్యక్తం చేశారు. దినసరి కూలీల సమస్యలపై ప్రజాగళం మార్కెట్ యార్డ్ చైర్మన్ ముప్పగంగారెడ్డిని వివరణ కోరగా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో చర్చించామని , గతంలో కూడా బకాయిలు ఉండడంతో అప్పులు చేసి బకాయిలు చెల్లించామన్నారు. గత మూడు నెలలుగా వేతనాలు బకాయిలు ఉన్న విషయం వాస్తవమేనని పేర్కొన్నారు. వారం పది రోజుల్లో బకాయిలను సర్దుబాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కొందరు తమపై కక్షతో లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ రిలే నిరాహార దీక్షలలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులుకొయ్యాడ రాజ్ కుమార్, మహిళా అధ్యక్షురాలు తార, దినసరి కూలీల సంఘం అధ్యక్ష కార్యదర్శులు, కూలీలు పాల్గొన్నారు.

# చెత్త సేకరణ ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షించాలి.

## రోడ్లపై పశువులు సంచరించకుండా చర్యలు చేపట్టాలి.

## కలెక్టర్ భవేష్ మిశ్రా. డంపింగ్ యార్డు సందర్శన.





నిజామాబాద్, ఆగస్టు 13 ( ప్రజా గళం ప్రతినిధి )

ఇంటింటికి తిరుగుతూ చెత్తను సేకరించే ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. రోడ్లపై ఎక్కడబడితే అక్కడ పశువులు సంచరించకుండా తక్షణ చర్యలు చేపట్టాలని నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ ను ఆదేశించారు. నాగారం శివారులోని డంపింగ్ యార్డును కలెక్టర్ గురువారం సందర్శించారు. నగర పాలక సంస్థ పరిధిలో రోజువారీగా ఇంటింటికీ తిరిగి సేకరించే చెత్తను డంపింగ్ యార్డు వద్ద నిలువ చేస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెత్తను ఆయా విభాగాల వారీగా వేరు చేస్తూ, ఎరువులు, ఇతర అవసరాల వినియోగం కోసం యంత్రాల సహాయంతో శుద్ధి చేస్తున్న విధానాన్ని పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు సగటున ఎంత పరిమాణంలో చెత్తను శుద్ధి చేస్తున్నారు, ఎరువును ఎవరికి అందజేస్తున్నారు తదితర వివరాలను ఆరా తీశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా బయో మైనింగ్ సులభం అవుతుందని అన్నారు. వ్యర్థాలను శుద్ధి చేస్తూ కంపోస్ట్ తయారీ కోసం ప్రతిపాదించిన మేరకు వేస్టేజ్ ప్రాసెస్సింగ్ యంత్రాల ద్వారా శుద్ధి ప్రక్రియ జరిపించాలన్నారు. కాగా, నగరంలో ప్రధాన మార్గాలలో రహదారులపై ఎక్కడబడితే అక్కడ ఆవులు, ఇతర పశు వులు సంచరిస్తుండడం వల్ల ప్రజలు, ప్రత్యేకించి వాహన చోదకులు ప్రమాదాల బారిన పడే ప్రమాదం ఉ ందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని పశువులు రోడ్లపై సంచరించకుండా తగిన చర్యలు తీసుకోవాలని, రోడ్లపై తిరిగే పశువులను గోశాలకు తరలించాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఇతర అధికారులు ఉన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, పంద్రాగస్టు వేడుక ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష.




నిజామాబాద్, ఆగస్టు 13 ( ప్రజాగళం ప్రతినిధి) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 15న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టనున్న నేపథ్యంలో, జిల్లా స్థాయిలో ఈ కార్యక్రమం నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టర్ భవేష్ మిశ్రా గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు. ఈ నెల 15న సంగారెడ్డిలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మధ్యాహ్నం రెండు గంటల సమయంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టనుండగా, జిల్లా స్థాయిలో నిజామాబాద్ నగరంలోని భూమారెడ్డి కన్వెన్షన్ హాల్ లో ఈ కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో నిర్వహించేలా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేపట్టింది. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిం చేందుకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ సలహాదారులు, ఎం.పీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, రేషన్ డీలర్లు, రేషన్ కార్డు లు కలిగిన లబ్దిదారులు హాజరు కానున్న దృష్ట్యా, పక్కాగా ఏర్పాట్లు ఉండాలన్నారు. వేదికను అందంగా ముస్తాబు చేయాలని, ప్రోటోకాల్ ను అనుసరిస్తూ ప్రజాప్రతి నిధులకు ఆహ్వానాలు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడ కూడా గందరగోళానికి తావు లేకుండా ముందస్తుగానే పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, సీటింగ్ అరేంజ్మెంట్, పార్కింగ్ వంటి అన్ని ఏర్పాట్లు చక్కబెట్టుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు బాధ్యతలు పురమా యించారు. అలాగే, ఈ నెల 15న ఉదయం వేళలో పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు కూడా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, సాధించిన పురోగతిని సమగ్రంగా తెలిపేలా ముఖ్య అతిథి ప్రసంగం నివేదిక ఉండాలన్నారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు సంబంధించి స్టాళ్ళను, శకటాలను ఏర్పాటు చేయాల న్నారు. దేశభక్తిని పెంపొందించేలా విద్యార్థులచే సాంస్కృ తిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని, స్వాతంత్ర్య సమర యోధులను, వారి కుటుంబీకులను ఘనంగా సత్కరిం చేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అధికారులు, అనధికా రులు, ప్రముఖులు, మీడియా ప్రతినిధులు, ప్రశంసా పత్రాల గ్రహీతలు, ప్రజలు వేడుకలను వీక్షించేందుకు వీలుగా సీటింగ్ అరేంజ్మెంట్ చేయాలని అన్నారు. ప్రశంసా పత్రాల పంపిణీ, పతాక ఆవిష్కరణ, వేదిక అలంకరణ, టెంట్, కుర్చీలు, సౌండ్ సిస్టం, మైక్, ప్రోటోకాల్ ప్రకారంగా ప్రముఖుల ఆహ్వానం, నిరంతర విద్యుత్ సరఫరా, అత్యవసర ఏర్పాట్లు, అగ్నిమాపక, వైద్య సేవలు తదితర అన్ని ఏర్పాట్లను సరి చూసుకో వాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లో, పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో జరిగే పంద్రాగస్టు వేడుకలకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావా లని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, జిల్లా రెవెన్యూ అధికారి బి.గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ట్రైనీ ఆర్డీఓ సందీప్, డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, డీఆర్డీఓ సాయన్న, సీ.పీ.ఓ కిషన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భైంసాలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ...

బాసర,ఆగస్టు 13: (ప్రజా గళం) నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గంలోని భైంసా పట్ట ణంలో గురువారం నిర్వహించిన హర్ ఘర్ తిరంగా భారీ ర్యాలీ కార్యక్రమంలో ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ పాల్గొన్నారు.జాతీయ జెండా ను చేతబట్టి ర్యాలీలో పాల్గొన్న ఆయన దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటిచెప్పారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ను ఎగుర వేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవ డంతో పాటు జాతీయ జెండా ఔన్నత్యాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.యువత పెద్ద సంఖ్యలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, విద్యార్థులు నాయకులు,కార్యకర్తలు,యువత తదిత రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.జాతీయ జెండాలతో నిర్వహించిన ర్యాలీ దేశభక్తి నినాదాలతో ఉత్సాహంగా సాగింది.

ప్రతి అక్షరం... ప్రజల పక్షం...
ప్రజాగళం
తెలుగు దినపత్రిక

శుక్రవారం
14 -08-2026

# నేరాల నియంత్రణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలి.


## డయల్ 112 గురించి విస్తృతంగా ప్రచారం చేయాలి. సమీక్ష సమావేశంలో సీపీ సాయి చైతన్య.



నిజామాబాద్ క్రైమ్ ఆగస్టు 13 (ప్రజాగళం ) నేరాలను నియంత్రించడంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సూచించారు. ఈ మేరకు ఆర్మూర్ డివిజన్ కు సంబంధించి నేరాల నియంత్రణ పై సమీక్ష సమావేశం గురువారం నందిపేట్ పోలీస్ స్టేషన్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య మాట్లాడుతూ,రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు డ్రగ్స్, గంజాయి నిర్మూలన కోసం ప్రత్యేక దాడులు కొనసాగించాలని , అక్రమ రవాణాలో పాల్గొనే వారిపై పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాల కింద చర్యలు తీసుకోవాలని కమిషనర్ పేర్కొన్నారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని , ఆన్‌లైన్ మోసాలకు గురైన బాధితులకు వెంటనే స్పందించి సహాయం అందించాలని తెలిపారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు , రెచ్చగొట్టే పోస్టులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నిజామాబాద్ డివిజన్ పరిధిలో నమోదైన వివిధ రకాల కేసులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా హత్య , హత్యాయత్నం , చోరీలు, మహిళలపై నేరాలు , సైబర్ మోసాలు , డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా , పేకాట , గుట్కా అక్రమ వ్యాపారం వంటి కేసులపై ప్రత్యేకంగా చర్చించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు త్వరిత న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని , రౌడీషీటర్లు , పాత నేరస్తులు , బెయిల్‌పై విడుదలైన వారిపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి పహారా వ్యవస్థను మరింత బలోపేతం చేసి , అనుమానాస్పద వ్యక్తులు మరియు వాహనాల తనిఖీలను కట్టుదిట్టంగా నిర్వహించాలని తెలిపారు. మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, షీ టీమ్స్ , ఈగల్ టీమ్స్ , చీతా ఫోర్స్ వంటి ప్రత్యేక బృందాలు మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆదేశించారు. విద్యాసంస్థలు , బస్టాండ్లు , రైల్వే స్టేషన్లు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పర్యవేక్షణ పెంచాలని సూచించారు. పేకాట , గుట్కా , ఇసుక, ఇతర అక్రమ వ్యాపారాలపై నిరంతర దాడులు నిర్వహించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లలో ప్రజలకు స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని , ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. రిసెప్షన్ నిర్వహణ , రికార్డుల నిర్వహణ , స్టేషన్ పరిశుభ్రత, సిబ్బంది క్రమశిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. సీసీ కెమెరాల వినియోగాన్ని మరింత విస్తరించి , నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించాలని అధికారులకు సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రతి పోలీస్ అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని పోలీస్ కమిషనర్ సూచించారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకొని , రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలలో బ్లాక్ స్పాట్లను గుర్తించి , సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. హైవే రోడ్డులను కలుపుతూ ఉండేటటువంటి లింకు రోడ్లకు స్పీడ్ బ్రేకర్లు వేయించడం , రోడ్డుకు అడ్డుగా ఉన్న పొదలను తొలగించే విధముగా చూడాలని అన్నారు. రోడ్డు ఇంజనీరింగ్ లోపాలు ఉన్నట్లయితే నేషనల్ హైవే, స్టేట్ హైవే అథారిటీ ఇతర సంబంధిత అధికారులతో సమన్వయంతో ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతి రోజు మీ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ లు నిర్వహించాలని , ఓవర్ స్పీడ్ , త్రిబుల్ డ్రైవింగ్ , మైనర్లు వాహనాలు నడుపుట లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలలో రోడ్డు భద్రత నిబంధనల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. డయల్ 112 గురించి ప్రజల వద్దకు చేరే విధంగా అనుక్షణం కృషి చేయాలన్నారు. రాబోయే పండుగల నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లను పటిష్టంగా నిర్వహించాలని , వాహనాల తనిఖీలు 24/7 తనిఖీలు చేయాలని , వాహనాల తనిఖీలు సమయంలో సిబ్బంది అలసత్వం పనికిరాదని తెలిపారు. ఈ కార్యక్రమం ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర రెడ్డి, సీసీఆర్ బి ఏసీపీ గురునాయుడు , సి.సి.ఆర్బి ఇన్స్పెక్టర్ ఆర్. అంజయ్య , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి , సీ.ఐ లు, ఎస్సై లు పాల్గొన్నారు.

# సాలూర క్యాంప్ వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఆటో పట్టివేత., తహసీల్దార్ అజ్మత్ నవాజ్ వెల్లడి.





బోధన్ ప్రతినిధి,ఆగస్టు 13: (ప్రజా గళం) బోధన్ నియోజకవర్గం సాలూర మండలం ఖాజాపూర్ లోని మంజీరా శివారు ప్రాంతం నుంచి బోధన్ వైపు ప్యాసింజర్ ఆటోలో, సంచుల్లో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా గురువారం రెవెన్యూ సిబ్బంది పట్టుకున్నారు. ఈ సందర్భంగా సాలూర మండల తహశీల్దార్ అజ్మత్ నవాజ్ మాట్లాడుతూ. సాలూర క్యాంప్ వద్ద రెవెన్యూ ఉద్యోగి సంజీవ్ చేపట్టిన తనిఖీల్లో నిబంధన లకు విరుద్ధంగా ఇసుక రవాణా చేస్తున్న ఈ వాహనం దొరికిందన్నారు. ఇసుక ట్రాలీ ఆటో ను తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ అజ్మత్ నవాజ్ హెచ్చరించారు.

# వృద్ధులు, బీడీ కార్మికులకు వెంటనే పింఛన్లు మంజూరు చేయాలి.

## బిజెపి నాయకులు డిమాండ్.

## ఎంపిడివో శంకర్ కు వినతిపత్రం అందజేత....




ఎడపల్లి,ఆగస్టు 12: (ప్రజా గళం) ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభు త్వం విస్మరించి,అర్హులైన వృద్ధులు,బీడీ కార్మికులకు పింఛన్లు మంజూరు చేయకపోవడం అన్యాయమని బిజెపి నాయకులు అన్నారు. బుధవారం ఎడపల్లి గ్రామ సర్పంచ్,బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కందగట్ల రాంచంద ర్ ఆధ్వర్యంలో,బీజేపీ మండల అధ్యక్షుడు కోలా ఇంద్ర కరణ్,జిల్లా మీడియా ఇంచార్జ్ కూరెళ్ల శ్రీధర్,తదితర నాయకులు ఎడపల్లి మండల అభివృద్ధి అధికారి శంకర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశా రు. పింఛన్లపై ఆధారపడుతున్న వృద్ధులు,బీడీ కార్మికు లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఎలాంటి జాప్యం లేకుండా,కటప్ డేట్ లేకుండాపింఛన్లు మంజూరు చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లెపూల శ్రీనివాస్, నయాబాది జై హనుమాన్ ఆలయ అధ్యక్షుడు మీసాల రాఘవేందర్,కంటెడి గంగాధర్,కంజరి ప్రదీప్ కుమార్, ద్యాకం సాయిరెడ్డి,కంజరి అభినవ్,బర్దిపూర్ విట్టల్, కట్కాం శంకర్,అనిరుద్ గౌడ్,రాఘవేందర్,మార సాయి తేజ, తదితర బీజేపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

- ఉచిత ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలి.
- సమీక్ష సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి రాజశ్రీ.



నిజామాబాద్ వైద్య విభాగం ఆగస్టు 13( ప్రజాగళం) సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి రాజశ్రీ సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు, జీవనశైలి వ్యాధులు , క్షయ వ్యాధి,వ్యాధి నిరోధక టీకాలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ బి. రాజశ్రీ గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి మాట్లాడుతూ, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పరిసరాల పరిశుభ్రత, నీటి ట్యాంకులను వారానికోసారి తప్పకుండా శుభ్రం చేస్తూ ప్రతిరోజు బ్లీచింగ్ పౌడర్ కలిసిన క్లోరినేషన్ వాటర్ ని తాగాలని, నీటి నిల్వలను తొలగించాలని, కాలి ప్లాట్లు, మురికినీటి నిల్వల్లో ఆయిల్ బాల్స్ ను వదలాలని, డెంగీ వ్యాధి వచ్చిన ఇంటి చుట్టూ 50 ఇళ్లలో పైరత్నం స్ప్రే చేయాలని, 100 ఇళ్ల వరకు టెమిఫాస్ స్ప్రే చేయాలనీ, ఇంటింటికి జర సర్వేను నిర్వహించి, ఉచిత ఆరోగ్య శిబిరాలను నిర్వహించాలన్నారు. ప్రతిరోజు రక్త పరీక్షలను నిర్వహించాలన్నారు. యాంటీ లార్వల్ స్ప్రేను, ఫాగింగ్ ను నిర్వహించాలన్నారు. డెంగీ సోకిన వారి దగ్గర అసలు ద్రవ ఆహారాలను తరచుగా తీసుకోవాలని, పారాసెటమాల్ మాత్రలు వేసుకుంటూ విశ్రాంతి తీసుకోవాలన్నారు, ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే నిర్వహించాలని, సీజనల్ వ్యాధులపై ప్రజల్లో పాఠశాలలో, కళాశాలలో విస్తృతంగా అవగాహన కలిగించాలన్నారు. నీటి కాలుష్యం వల్ల వ్యాపించే వ్యాధులను నీటి పరీక్ష కిట్లను ఉపయోగించి నీటి నాణ్యతను పరీక్షించాలన్నారు. తద్వారా టైపాయిడ్ డయేరియా అతిసారా కలరా వంటి వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పడాలన్నారు, క్షయ వ్యాధిగ్రస్తుల కోసం నిర్వహించే క్షయ నిర్ధారణ పరీక్షలను ప్రజలు వినియోగించుకోనేలా చూడాలని, క్షయ వ్యాధిగ్రస్తులు 6 నెలల చికిత్స కోర్సును వాడాలన్నారు, జీవనశైలి వ్యాధుల్లో భాగంగా 30 సంవత్సరాల పైబడిన వారిని హైపర్ టెన్షన్ మధుమేహం క్యాన్సర్ కోసం నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలి అన్నారు, పరీక్షల కోసం పెండింగ్లో ఉన్న వారందరినీ పరీక్షించి ఎమ్మా లాగిన్ లో నమోదు చేయాలన్నారు. ఇప్పటికే చికిత్స తీసుకుంటున్న వారందరినీ లైన్ లిస్టు ద్వారా ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. వ్యాధి నిరోధక టీకాల ద్వారా నియంత్రించే వ్యాధులను టీకాలు తీసుకోవడం ద్వారా నియంత్రించవచ్చు అన్నారు. అనుమానిత కేసులైన ఏ ఎఫ్ పి, మీజిల్స్ షాంపూల్స్ ను సేకరించి పంపించాలన్నారు, ఈ సమీక్ష సమావేశంలో డిటిసి ఓ డాక్టర్ దేవి నాగేశ్వరి, పి ఓ డి టి డాక్టర్ అంజన, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ సికందర్ నాయక్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వెంకన్న, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ శ్రావ్య, డిస్టిక్ ఫార్మసీ సూపర్వైజర్ నారాయణ, హెచ్ఈఈవో జహీద్ ఆఫీస్, డిప్యూటీ డెమో దుర్గారావు, డి హెచ్ ఈ ఘన్పూర్ వెంకటేశ్వర్లు వివిధ పీహెచ్సీల సిహెచ్ ఓలు, హెచ్ ఈ లు, హెచ్ ఇ ఓ లు, సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# రుద్రూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట హమాలీ కార్మికుల ఆందోళన!.

## ఇందిరమ్మ ఇండ్లు,పెన్షన్ ఇవ్వా లని,కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, సీఐటీయూ జిల్లా నాయకుడు నన్నేసాబ్ డిమాండ్...



బోధన్ ప్రతినిధి,ఆగస్టు 13: (ప్రజా గళం) బోధన డివిజన్ రుద్రూర్ మండల తహసీల్దార్ కార్యాల యం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం హమాలీ కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భం గా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని తహసీల్దా ర్ తారాబాయికి వినతిపత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు నన్నేసాబ్ మాట్లా డుతూ,కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించి నట్లుగా హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టు కోవాలని కోరారు. 55 సంవత్సరాలు నిండిన హమాలీ కార్మికులందరికీ 6వేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 120 గజాల స్థలం కేటాయించి, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీ కార్మికులు భీమయ్య, మహబూబ్,లక్ష్మణ్,సాయిలు,పీరయ్య,గంగాధర్, కిరణ్,హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు.

# బోధన్ మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి తనిఖీ చేసిన జిల్లా అడిషనల్ కలెక్టర్ పాముూరు సురేష్..



బోధన్ ప్రతినిధి, ఆగస్టు 13: (ప్రజా గళం) బోధన్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని నిజా మాబాద్ అడిషనల్ కలెక్టర్ పామూరు సురేష్ గురువా రం సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మున్సి పల్ కార్యాలయంలోని వివిధ విభాగాల పనితీరును పరిశీలించారు. అనంతరం బోధన్ పట్టణంలోని వివిధ వార్డుల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు,పారిశుద్ధ్య నిర్వహణ,పరిసరాల పరిశుభ్రత,ప్రజలకు అందుతున్న మున్సిపల్ సేవలపై మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ ను అడిగి తెలుసుకున్నారు. వార్డుల వారీగా సమస్యల ను గుర్తించి వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యల పై వివరాలు సేకరించారు. పట్టణంలో పారిశుద్ధ్య నిర్వ హణపై ప్రత్యేక దృష్టి సారించాలని,ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు,అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచిం చినట్లు తెలిసింది. అనంతరం వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమీక్ష నిర్వహించి,ఆయా శాఖల పరిధి లోని సమస్యలు,పెండింగ్ పనులు,వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై ఒక్కొక్కరిని అడిగి తెలుసుకు న్నారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అడిషన ల్ కలెక్టర్ పామూరు సురేష్ సూచించారు.

Printed, Published, and Owned by KOKKU RAVI KUMAR Editor: KOKKU RAVI KUMAR, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003. Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com